లాలాచెరువులో అభివృద్ధి పరుగు

- సీఎం జగన్ పాలనలో మహర్దశ
- వసతుల కల్పనపై ఎమ్మెల్యే రాజా ప్రత్యేక దృష్టి

రాజమహేంద్రవరం సిటీ: మహానగరంగా మారుతున్న రాజమహేంద్రవరంలో తాజాగా చేరిన లాలాచెరువు పంచాయతీలో రూ.కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరిన్ని పనులకు చేపట్టేందుకు కూడా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. లాలాచెరువు పంచాయతీ భౌగోళికంగా నగరంలో కలిసి ఉన్నప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది. నగర పాలక సంస్థకు ఆనుకుని ఉన్నప్పటికీ రాజానగరం నియోజక వర్గంలో కలసి ఉండటం, పంచాయతీ ప్రాతిపదికగా నిలిచిపోవడంతో కనీసం డ్రైనేజీల నిర్మాణానికి నోచుకోలేకపోయింది.

అభివృద్ధికి చిరునామా

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోనికి రావడంతో లాలాచెరువు పంచాయతీలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. గత టీడీపీ పదేళ్ల పాలనలో రూ.67.79 లక్షలతో పనులు చేపడితే, వైఎస్సార్ సీపీ పాలనలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నేతృత్వంలో కేవలం నాలుగేళ్లలో రూ.6.05 కోట్లతో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గత ప్రభుత్వంలో కనీసం సీసీ డ్రెయిన్, రోడ్డు, తాగునీటి లేని దుస్థితి నెలకొంటే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మోడల్ పంచాయతీగా రూపుదిద్దుకుంటోంది.



లాలాచెరువు పంచాయతీలో నిర్మించిన సీసీ డ్రైనేజీ



కొత్తగా నిర్మించిన రోడ్డు

పంచాయతీ తీరుతెన్నులు

పాలచర్ల పంచాయతీలో భాగంగా ఉన్న 23 సర్వే నంబర్లతో 260 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీ, స్పిన్నింగ్ మిల్లు కాలనీ కలసి లాలాచెరువు పంచాయతీగా 1994లో ఆవిర్భవించింది. ప్రస్తుతం ఈ పంచాయతీలో 2,500 గృహాలు, సుమారు 12,000 మంది జనాభా ఉన్నారు. ఎక్కువగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలు జీవిస్తున్నారు. ఈ పంచాయతీ కేవలం ఇంటిపన్నులతో మాత్రమే పాలన సాగిస్తూ వచ్చింది. టీడీపీ పదేళ్ల పాలనలో కనీస మౌలిక వసతులు కల్పించలేదు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో..

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేపట్టిన నాలుగేళ్లలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంలో రూ.కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సచివాలయ భవనాలు, రైతుబజారు, హెల్త్ క్లినిక్‌లు, గ్రామ మహిళా సమాఖ్య భవనం, నాడు – నేడులో పాఠశాల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు రూ.40 లక్షలతో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జక్కంపూడి రామ్మోహనరావు మెమోరియల్ పార్కు నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం లాలాచెరువు పంచాయతీని నగరపాలకసంస్థలో విలీనం చేస్తూ జారీ చేసింది. 2022 మే 21 ఉత్తర్వులు అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ వెలువడంతో లాలాచెరువు పంచాయతీ రాజమహేంద్రవరం నగరపాలకసంస్థలో విలీనమైంది. నగరపాలకసంస్థ అధికారులు తక్షణమే 14వ వేతన సంఘం నిధులు, జనరల్ నిధులు రూ.5.06 కోట్లతో సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేపట్టింది.

వసతుల కల్పనపై దృష్టి



లాలాచెరువు పంచాయతీలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాం. రూ.24.60 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాం. స్పిన్నింగ్‌మిల్లు, హౌసింగ్ బోర్డు కాలనీలలో 46 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా 9 కిలోమీటర్లు పూర్తయ్యాయి. రూ.8.60 కోట్లతో మిగిలిన సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు చేయగా, మంజూరుకు సిద్ధమయ్యాయి. ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.16 కోట్లతో గోదావరి నీరు అందించేందుకు ప్రతిపాదనలు చేశాం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

– జక్కంపూడి రాజా, రాజానగరం ఎమ్మెల్యే

ఎమ్మెల్యే రాజా కృషి



లాలాచెరువు పంచాయతీలో ఈ నాలుగేళ్లుగా అభివృద్ధి పరుగులు పెడుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. ఆయన ప్రత్యేక దృష్టి సారించి పెద్దమొత్తంలో నిధులు తీసుకువచ్చారు. ఇక్కడి ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారు. గత టీడీపీ పాలనలో ఈ ప్రాంతాన్ని విస్మరించారు.

– కడలి సీతారత్నం, మాజీ సర్పంచ్ లాలాచెరువు

క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



అన్నవరం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: మండల పరిధిలోని నల్లమిల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మామిడాల అన్నవరం ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం అన్నవరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేసి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ నల్లా పద్మ, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లా దుర్గా ప్రసాద్‌లు ఉన్నారు.

పోక్సో కేసు నమోదు

సీతానగరం: ఇనుగంటివారిపేటకు చెందిన బాలికను ప్రేమపేరుతో నమ్మించి మోసం చేసిన అబ్దుల్ కరీమ్‌పై పోక్సో కేసు నమోదు చేశామని ఇన్‌చార్జి ఎస్సై వి.సత్యనారాయణ సోమవారం తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు అందజేత

గోకవరం: మండలంలో నూతనంగా ఎంపికైన వలంటీర్లకు సోమవారం వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు నియామక పత్రాలు అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా ఎంపికైన వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో లబ్ధిదారులకు అందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏసురత్నం, తోలేటి రాంప్రసాద్, అల్లాడ రాంబాబు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు ఆర్థిక సాయం



వడిశలేరులో శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం చేస్తున్న ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు

రంగంపేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఫొటోగ్రాఫర్‌కు మండల ఫొటోగ్రాఫర్ల సంఘం ఆర్థిక సాయం అందించింది. రంగంపేట మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘానికి కోశాధికారిగా వ్యవహరిస్తున్న అల్లం దుర్గా శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యం బారినపడ్డారు. దీంతో మండల యూనియన్ ప్రెసిడెంట్ చక్రవర్తి, జిల్లా సభ్యుడు కె.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ వి.నాగబాబు, సెక్రటరీ జి.సతీష్, గౌరవ అధ్యక్షుడు పివివి సత్యనారాయణ మూర్తిలు సోమవారం వడిశలేరులో శ్రీనివాస్‌ను కలిసి పరామర్శించారు. ఆయనకు వైద్య ఖర్చుల నిమిత్తం యూనియన్ తరపున రూ.17,500 అందజేశారు.

దుకాణాల తనిఖీ



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మధురపూడి: కోరుకొండలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాసరెడ్డి, సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. దేవీ ఏజెన్సీస్, పద్య ఫెర్టిలైజర్స్ అండ్ జనరల్ స్టోర్స్‌లో సరకు నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అన్ని సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రికార్డు ప్రకారం సరకు నిల్వ లేకుంటే చర్యలు తప్పవన్నారు. త్వరలో మిగిలిన దుకాణాలను కూడా తనిఖీ చేస్తామన్నారు. కార్యక్రమంలో కోరుకొండ మండలాధికారి ఏ. గౌరీదేవి పాల్గొన్నారు.

అభినందనలు



విద్యార్థిని లక్ష్మీలాలిత్య, పీఓ షేక్ మీరాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ధనరాజ్

రాజానగరం: అస్సాంలోని జీర్‌హట్ కజిరంగా యూనివర్సిటీలో వారం రోజులు నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరంలో స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వలంటీర్ కె.లక్ష్మీలాలిత్య, పీఓ షేక్ మీరా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలు, వస్త్రధారణలపై ఇతర రాష్ట్రాల వారికి అవగాహన కలిగించారు. ఈ శిబిరానికి రాష్ట్రం నుంచి పదిమంది హాజరు కాగా, వారిలో వీరిద్దరూ ఉన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ మాట్లాడుతూ ఏక్ భారత్, శ్రేష్ట భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9 నుంచి 15 వరకూ ఈ శిబిరాన్ని నిర్వహించారన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలు సెలీనా



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన డా.బీఎస్ సెలీనా

అనపర్తి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలిగా ఇటీవల నియమితులైన గుంటూరుకు చెందిన డాక్టర్ బీఎస్ సెలీనా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఆయన స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ ప్రత్యేక అధికారి(ఓఎస్డీ) పడాల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా అడబాల



రంగంపేట: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా అడబాల వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు నియామకాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రకటించారు. రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామానికి చెందిన అడబాల వెంకటేశ్వరరావు వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు. ప్రస్తుతం అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు. వెంకటేశ్వరరావుకి జిల్లా పార్టీ పదవి దక్కడంపై మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనకు పార్టీ జిల్లా పదవి అప్పగించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సీతానగరం: మండలంలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సోమవారం పరామర్శించారు. కాటవరానికి చెందిన కరుటూరి చిన్న బాపినాయుడు, సీతానగరం పంచాయతీ పరిధి లంకూరులోని చౌటుపల్లి బంగారయ్య, చీపురపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, బి.లక్ష్మి, వేములూరిలో పెద్ద వెంకటేశ్వర్లు, నాగంపల్లిలో బేడిసి తాతయ్య ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, ఎంపీటీసీలు తాడేపల్లి వెంకట్రావు, వెన్నెల అప్పల నాయుడు, బిడిసే లక్ష్మి, పార్టీ నాయకులు కోన రామకృష్ణ, మన్నెలి వెంకట్రావు, గోపిశెట్టి అచ్చారావు, ద్వారంపూడి రామకృష్ణ, తోరం పోశియ్య ఉన్నారు.



చీపురపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

విద్యాభివృద్ధికి జగనన్న పెద్దపీట

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేసి అనేక పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు అన్నారు. సంపర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన చొడిశెట్టి వెంకటలక్ష్మి, కొరుప్రోలు భువనేశ్వరి, చల్లపల్లి శివరామ స్వామిలకు జగనన్న ఆణిముత్యాలు పథకంలో భాగంగా అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రాంచ్ మెడల్స్, నగదు, సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్.త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యుడు ఎరుబండి రామచంద్రరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా రామ అయ్యన్న, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సలాది విమల తదితరులు పాల్గొన్నారు.



సంపరలో విద్యార్థికి మెడల్, నగదు, సర్టిఫికెట్ అందజేస్తున్న ముక్తేశ్వరరావు తదితరులు

24 నుంచి కూనలమ్మ అమ్మవారి జాతర



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మండలంలోని కూనవరంలో కొలువైన కూనలమ్మ అమ్మవారి జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆవిష్కరించారు. రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి 12 ఏళ్లకు ఒక్కసారి అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 24 నుంచి 28 వరకూ అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం మెంబర్ పిచ్చయ్య, సొసైటీ అధ్యక్షుడు అయిల పాపారావు, ఎంపీటీసీ నల్లమోలు భాస్కరరావు, అయిల ఉపేంద్ర, జక్కంపూడి శ్రీను, నల్లమోలు పాపారావు, నరసింహారావు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలు విద్యార్థులకు వరం



వడిశలేరు హైస్కూల్లో విద్యార్థులను సత్కరించిన నాయకులు



బిక్కవోలులో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న జంగా వీర వెంకట సుబ్బారెడ్డి

రంగంపేట: జగనన్న ఆణిముత్యాలు విద్యార్థులకు వరం లాంటిదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్ అన్నారు. వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాడపర్తి చందు, మద్దూరి నాగ ప్రవీణ్, చీకట్ల పావనిలను సత్కరించి నగదు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, శ్రీరామ్, సచివాలయ కన్వీనర్లు ఎం.భద్రరావు, యు.చిన్నా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పేద విద్యార్థులను ప్రోత్సహించడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆణిముత్యాలు కార్యక్రమాన్ని తీసుకొచ్చారని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం బిక్కవోలు ఉన్నత పాఠశాలలో పదోతరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన చరిష్మా లక్ష్మీదుర్గకు రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన సాయి సౌమ్యశ్రీకు రూ.2 వేలు, తృతీయ స్థానం సాధించిన ఎస్.లలితకు రూ.వెయ్యి నగదు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పీఎస్ఎన్‌రెడ్డి, ఉపాధ్యాయులు జేఎస్ ప్రసాద్, రామలక్ష్మి పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో గుప్త, రత్నంరాజు, రమేష్, నాగభూషణం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ముగ్గళ్లలో గడపగడపకూ..



ముగ్గళ్లలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని ముగ్గళ్లలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా గడపగడపకూ వెళ్లి లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు 2,637 మంది ఉన్నారన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.12.56 కోట్లు నేరుగా జమ అయ్యిందన్నారు. గత టీడీపీ హయాంలో గ్రామాభివృద్ధికి ఐదేళ్లలో రూ.5.70 లక్షలు వెచ్చిస్తే, నేడు జగనన్న ప్రభుత్వం ఏర్పడిన రూ.3.91 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు మనసారా ఆశీర్వదించాలన్నారు.

మెరుగైన వైద్యానికి చర్యలు

ముగ్గళ్లకు చెందిన బందిల కృష్ణయ్య తాను సుగర్‌తో బాధపడుతున్నానని, నడవడానికి కష్టంగా ఉందని, ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌తో బతుకుతున్నానని తెలిపాడు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్పందించి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే ప్రమాదంలో కాలు కోల్పోయిన గుర్రాల సాహెబ్‌కు ట్రైసైకిల్ అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన చోట డ్రైనేజీలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్ నీలి ఆనంద్ కుమార్, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, విజిలెన్స్, మానటరింగ్ కమిటీ సభ్యుడు సాదె చంటిబాబు, పార్టీ నాయకులు సుంకవల్లి సుబ్రహ్మణ్యం, మన్యం నాని, కూచిపూడి బాబ్జీ, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

నేడు దోసకాయలపల్లిలో..

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక దుర్గమ్మ ఆలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొంటారన్నారు.

జగనన్న సురక్ష పథకంతో ప్రజా సమస్యలకు చెక్

పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుభాష్‌లు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, డ్వాక్రా యానిమేటర్లకు జగనన్న సురక్ష పథకం అమలుపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలకు వెంటనే చెక్ పెట్టడానికి జగనన్న సురక్ష పథకం దోహదపడుతుందన్నారు. జులై 1వ తేదీ నుంచి నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తారన్నారు. సచివాలయాల వద్ద శిబిరాలు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలకు అర్హులైన వారికి ధ్రువపత్రాలు జారీ చేస్తారన్నారు.

ఎంఈఓ-2గా నల్లమిల్లి సత్తిరెడ్డి

అనపర్తి: ఈ నెల 18న కాకినాడలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో అనపర్తి మండల విద్యాశాఖాధికారి-2గా నల్లమిల్లి సత్తిరెడ్డి నియమితులయ్యారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన సత్తిరెడ్డి ఇటీవల నిర్వహించిన బదిలీల్లో మండలంలోని పీరారామచంద్రపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బదిలీపై వెళ్లారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కె.హిమమహేశ్వరిని కలిసి ఎంఈఓ-2గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎంఈఓ-2గా బాధ్యతలు స్వీకరిస్తున్న నల్లమిల్లి సత్తిరెడ్డి

ఎంఈఓ -2గా సుజాత

మధురపూడి: కోరుకొండ మండల విద్యాశాఖాధికారి-2గా ఎం.సుజాత సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మానవుల అభివృద్ధిలో విద్య ఎంతో కీలకం

రాజానగరం: మానవుల సంపూర్ణాభివృద్ధిలో విద్య ఎంతో కీలకపాత్ర పోషిస్తుందని కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సివిల్ విభాగాధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సునీల్ కుమార్ అన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ సహకారంతో సార్వత్రిక మానవ విలువలు అనే అంశంపై సోమవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వ్యక్తిగతంగా ప్రారంభమయ్యే మన అభివృద్ధిని, పనిచేస్తున్న సంస్థ అభివృద్ధికి, తద్వారా సమాజాభివృద్ధికి విస్తరింపజేయాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ మాట్లాడుతూ బీటెక్ చదువుతున్న విద్యార్థులకు మానవ విలువలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో మూడు క్రెడిట్స్‌తో కూడిన ఈ కోర్సును ప్రారంభించామన్నారు. ముందుగా అధ్యాపకులకు నూరు శాతం అవగాహన ఉండాలని భావించి మూడు రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.లీలావతి, డాక్టర్ ఎస్‌పీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ డాక్టర్ వి.కుసుమకుమారి, ప్రొఫెసర్ గీత, ప్రొఫెసర్ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో సోమవారం మలేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో పి.రాధాకృష్ణ మాట్లాడుతూ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే అందుబాటులోని ఏఎన్ఎం, ఆశావర్కర్లను సంప్రదించి మలేరియా నిర్ధారణ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు మున్నీషాబేగం, సలీమాబీ, స్వరూప పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం మలేరియా వ్యాధి నివారణపై గ్రామ వలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ మేరీ కృప, ఎంపీహెచ్ఈఓ రాయుడు మాట్లాడుతూ ఇళ్ల మధ్య వ్యర్థాలు, నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగిపోయి మలేరియా, డెంగీ, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్, రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యం

మధురపూడి: చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, అందులో భాగంగానే సీఎం జగన్ విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు మద్దాల రమణ అన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం హైస్కూల్లో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముగ్గురు విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన నగదు ప్రోత్సాహక బహుమతులు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1,500 అందజేశారు. మద్దాల రమణ ఒక్కో విద్యార్థికి రూ.500 చొప్పున అందించారు. బూరుగుపూడి హైస్కూల్లో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తిబాబు, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, నానాజీ, కుటుంబరావు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న నాయకులు